# మహాకూటమి తథ్యం!

● తెరాసతో పొత్తు ఖరారు
● సీపీఎంతోనూ దాదాపు ఖాయం
● సీపీఐ కూడా వస్తుంది ● తెదేపా ధీమా

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో తెదేపా అత్యంత వ్యూహాత్మకంగా ముందుకు కదులుతోంది. 2004 ఎన్నికలప్పుడు ప్రతికూలంగా మారిన అంశాలు ఒక్కొక్కదాన్ని ఇప్పుడు సానుకూలంగా మార్చే ప్రయత్నంలో పడింది. ఇందులో అత్యంత ప్రధాన అంశం విపక్షాల ఐక్యత. తెరాస, సీపీఎం, సీపీఐలతో తాము కలిస్తే తెలంగాణలో దాదాపు సంపూర్ణంగాను, కోస్తాలో కూడా కొంతమేరకు విపక్ష ఓటు చీలకుండా చేయవచ్చన్న ఉద్దేశంతో ఉన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే తెదేపా-తెరాసల మధ్య పలు దఫాలు చర్చలు జరిగాయి. ఇరు పార్టీల అధినేతలు చంద్రబాబు-కేసీఆర్‌లు కూడా చాలాసార్లు మాట్లాడుకున్నారు. ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, పొత్తులకు తుదిరూపం ఇచ్చేందుకు అక్టోబర్ 6న తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించనున్నారు. మరోవైపు సీపీఎం విషయానికొస్తే... జాతీయ స్థాయిలో తీసుకునే వైఖరినే రాష్ట్రంలోనే అవలంబించాలన్న నిర్ణయంతో ఆ పార్టీ ఉంది. జాతీయ స్థాయిలో తెదేపాతో కలిసి పనిచేస్తున్నందున రాష్ట్రంలోనూ ఆ పార్టీతోనే కలిసి పనిచేయాలన్న నిర్ణయం తీసుకుంటారని తెదేపా నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని అంతర్గత సమావేశాల్లో సీపీఎం నేతలు ఇప్పటికే చెప్పున్నారని వారంటున్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు అక్టోబర్ 6, 7తేదీల్లో ఉన్నాయి. ఈ సమావేశాలకు సీపీఎం అగ్రనేతలు ప్రకాశ్ కారత్, సీతారాం ఏచూరిలు కూడా రానున్నారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో రాజకీయ పరిస్థితిని చర్చించి తమతో కలిసిరావాలన్నదానిపై తుది నిర్ణయం తీసుకుంటారని తెదేపా చెప్తోంది.

## తేల్చుకోవాల్సింది సీపీఐనే!

రాష్ట్ర స్థాయిలో మూడో కూటమి అంటూ ప్రజారాజ్యంతో పొత్తుకు రాయభారం నడిపిన సీపీఐనే ఇక అటో, ఇటో తేల్చుకోవాల్సిన పరిస్థితిలో ఉంటుందనేది తెదేపా విశ్లేషణ. తెరాస, సీపీఎంలు తమతో కలిశాక సీపీఐ విడిగా వెళ్లేందుకు సాహసించకపోవచ్చని తెదేపా నేతలు అంటున్నారు. సీపీఐకు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తెలంగాణలోనే... అదీ నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఆదరణ ఎక్కువగా ఉంది. ఒకవేళ తెదేపా, తెరాస, సీపీఎంలు కలిస్తే ఈ రెండు జిల్లాల్లో ఆ కూటమి ప్రభావం బలంగా ఉండే అవకాశాలున్నాయని, ఇదే జరిగితే సీపీఐ కూడా కలసి రాక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని వారు నమ్ముతున్నారు. మరోవైపు సీపీఐ కేంద్ర నాయకత్వం కూడా జాతీయ పరిణామాల దృష్ట్యా తమతో కలిసేందుకు సుముఖంగానే ఉందని, తాము వారితో చర్చలు జరుపుతున్నామని చెప్తున్నారు. పొత్తులపై అక్టోబర్ 18, 19తేదీల్లో సీపీఐ రాష్ట్ర కమిటీ సమావేశం జరగనుంది. ఇందులో రాష్ట్రంలో మిగతా పరిణామాలు, తెరాస, సీపీఎంల వైఖరులను పరిశీలించి, జాతీయ నాయకత్వం సూచన మేరకు తెదేపాతో కలవాలనే నిర్ణయాన్ని సీపీఐ తీసుకుంటుందని అంటున్నారు. మొత్తంమీద తామనుకున్న మహాకూటమి అక్టోబర్ చివరి నాటికి సాకారం అవుతుందని, పొత్తులపై ఒక స్పష్టత వస్తుందని తెదేపా అంచనా వేస్తోంది.